లక్ష్య సాధనకు హెచ్‌ఎంలు కృషి చేయాలి

- 'పది' వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కీర్తిప్రసన్న, మాధవిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, ఫిబ్రవరి 3 : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని, అందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సబ్జెక్టుల వారీగా వార్షిక పరీక్షలకు సంసిద్ధులను చేయాలన్నారు. 2022-23లో పదో తరగతిలో జిల్లా 92 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఈ ఏడాది వందశాతం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. గత ఏడాది ఖిలావరంగల్, గీసుకొండ, నర్సంపేట మండలాల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదైనట్లు గుర్తుచేశారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించాలని డీఈవో వాసంతిని ఆదేశించారు. అనంతరం వీర్ గాథా విజేత కీర్తిప్రసన్న, గైడ్ టీచర్ కే మాధవిని కలెక్టర్ సత్కరించారు. అనంతరం విద్యార్థుల మోడల్ పర్యావరణ జిల్లా పరిషత్ నిర్వహణ కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. మేడారంలోని జంపన్నవాగు ప్రాంతంలో పారిశుద్ధ్యం, రవాణా, ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, రంగయ్య, విజయ్‌కుమార్, రత్నమాల, డీఎస్‌వో శ్రీనివాస్, ఏఎంవో సారయ్య, కోఆర్డినేటర్ సుధీర్‌బాబు, వీర్ గాథా నోడల్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా రిసోర్స్‌పర్సన్ బాలాజీరావు పాల్గొన్నారు.

'ఎలాంటి కేసులు నమోదు కాలేదు'

రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వీఎంఎలపై జిల్లాలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల పిటిషన్ కాలం గత నెల 17తో ముగిసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు లోకసభ ఎన్నికలకు ఉపయోగించేందుకు సోమవారం తెరుస్తామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు

జిల్లాలో వచ్చే వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులు నీటి శుద్ధి నుంచి మొదలుకొని ఇంటింటికీ చేరే వరకూ ఎలాంటి సమస్య ఉందో పరిశీలించాలన్నారు. సమస్యలపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు.

రేపు గ్రీవెన్స్ రద్దు

కలెక్టరేట్‌లో సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను పరిపాలనా పరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఫిర్యాదులు అందించేందుకు కార్యాలయానికి రావొద్దని కోరారు.

ఏకశిల పార్కును అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే నాయిని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, ఫిబ్రవరి 3: ఏకశిల పార్కులో వాకింగ్ ట్రాక్ తో పాటు పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ వినతి మేరకు ఎమ్మెల్యే పార్కును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తానన్నారు. సమావేశంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగా రాజిరెడ్డి, గౌరవాధ్యక్షుడు చాడ దశరథ రాంరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ 303 వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పచ్చిమట్ల ఎల్లాగౌడ్, ప్రధాన కార్యదర్శి పడాల సోమయ్య, ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి రాజిరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు రవీందర్‌రావు, వీరస్వామి, రవీందర్ యాదవ్, అరుణారెడ్డి, సుమతి, అరుణ, రమణారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

'క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు భయపడొద్దు'

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన అవసరం లేదని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం సాయికుమార్ ధైర్యం చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 3వ డివిజన్ ఆరెపల్లిలోని ప్రతిమ క్యాన్సర్ దవాఖానలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహార అలవాట్లు, నిత్యం వాకింగ్ చేయడం వల్ల క్యాన్సర్‌ను జయించొచ్చన్నారు. అనంతరం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్స్ కౌన్సిల్ ఆర్ సురేశ్, అసిస్టెంట్ కౌన్సిల్ ఆర్.రజిని, ప్రతిమ హాస్పిటల్ డైరెక్టర్ అవినాష్ తిప్పని, ఏజీఎం మోహన్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : తాగునీటి సరఫరా, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనపై మంత్రి సీతక్క శనివారం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి ములుగు జిల్లా కేంద్రం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేకాధికారులకు నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపడుతామని తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE HANUMAKONDA AT HANUMAKONDA
I.A.No. 244 of 2023
O.S.NO. 311 OF 2013
Between:
Syed Akbar Biyabani (died) per Lrs., Shahin Begum ...Petitioner/Plaintiff
And
Syed Abdul Sultana & Others ...Respondents/Defendants
To
R6) Chelukani Padma, W/o.Ravinder, Age: 40 years, Occu: Household, R/o. H.No.2-26 Gurrampet, Venkatapur, Peddapur, Jayashankar Bhupalpally
R16) Dasari Swaroopa Rani, W/o.Dasari Sammaiah, Age: 48 years, Occu: Household, R/o.H.No. 2-4-1210/C, Ashoka Colony, Hanamkonda.
NOTICE
Please take notice that the above named petitioner/plaintiff had filed the above petition against you both and others for impleading in the suit proceedings Under Order XXII Rule 10 of C.P.-C R/w.sec.I Rule 10 (2) of CPC which was filed for the relief of partition and separate possession of the suit schedule property therein, and the said case was posted for your appearance on 16-02-2024, as such your appear on personally or through your advocate on the above said date at 10.30 Am at the above said Hon'ble court, failing which the matter will be decided on merits.
//BY ORDER OF THE COURT//
Sd/- PURMA SRINIVAS REDDY
ADVOCATE, H.No.2-6-916/406, KLN Reddy Colony, Hanamkonda Cell : 9848377345

మద్యం పట్టివేత

గీసుగొండ, ఫిబ్రవరి 3 : గీసుగొండలో శనివారం బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి చేశారు. సీఐ మధుసూదన్ కథనం ప్రకారం.. పోకనాటి స్వప్న కిరాణా షాపు మాటున బెల్టుషాపును నిర్వహిస్తున్న విషయం తెలుసుకుని తనిఖీ చేసి రూ. 12,360 విలువైన మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిశ్రమల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి : ఎమ్మెల్యే రేవూరి

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, ఫిబ్రవరి 3 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్న పరిశ్రమలు తమ యూనిట్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం టీఎస్‌ఐఐసీ అధికారులతో కలిసి పార్కును సందర్శించారు. కిటెక్స్ వస్త్ర పరిశ్రమతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. పార్కు నిర్మాణంతో ఈ ప్రాంతంలో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోశ్, ఎంపీపీ భీమగాని సౌజన్య పాల్గొన్నారు.

'సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు'

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3 : గుండెపోటు, ఇతర అత్యవసర సమయాల్లో సీపీఆర్ ప్రక్రియ ద్వారా వ్యక్తుల ప్రాణాలను కాపాడొచ్చని సీపీఆర్ జిల్లా శిక్షణ అధికారి డాక్టర్ గోపాల్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ సిబ్బందికి శనివారం ఆయన సీపీఆర్ ప్రక్రియపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో భారతి, ఆర్‌ఐ స్వామి, సూపరింటెండెంట్ దయాకర్, డాక్టర్ సరోజ, సీహెచ్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపేటలో సీఎండీ తనిఖీలు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3: వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటను శనివారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్లను పరిశీలించారు. అనంతరం రైతులతోపాటు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు నోటీసులు

నర్సంపేట, ఫిబ్రవరి 3: నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లకు షోకాజ్ నోటీసులు అందించినట్లు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ తెలిపారు. చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, 12వ వార్డు కౌన్సిలర్ ఎండీ పాషా, 24వ వార్డు కౌన్సిలర్ దార్ల రమాదేవి బీఆర్‌ఎస్ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో పట్టణ కమిటీ నుంచి షోకాజ్ నోటీసు ఇచ్చామని పేర్కొన్నారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

గురిజాలలో బోర్‌వెల్ పనులు ప్రారంభం

నర్సంపేట రూరల్, ఫిబ్రవరి 3: గురిజాలలోని శ్మశానవాటికలో శనివారం బోర్‌వెల్ పనులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ప్రారంభించారు. నాయకులు గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సదానందం, రమేశ్, మోటూరి రవి, రాజమల్లు, నర్సింగం, కొమురయ్య, రాయపురెడ్డి, హరీశ్, అల్లి రవి పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలను తొలగించాలి

నగర సంకీర్తనలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 3: సమాజంలో అసమానతలను తొలగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. వరంగల్‌లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమతా దీక్షలో భాగంగా పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట సీకేఎం కళాశాల గ్రౌండ్ వరకు శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 27 వరకు సమతా యాత్ర, దీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమతా దీక్ష అంటే మనందరం బాగుడాలని జీయర్‌స్వామి భక్తులకు సూచించారు. ఈ నెల 20 నుంచి మార్చి 1 వరకు 12 రోజులపాటు సమతా కుంభ్-2024 పేరిట నిర్వహించే ద్వితీయ వార్షికోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, శఠగోపాచార్యులు, సభ్యులు తిరుమల్‌రావు, వసంత, ఉమ, శశిధర్, శ్రీరాములు, రాజేందర్, తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు అండగా ఉంటాం

పీఠాధిపతులతో మాట్లాడుతున్న సురేఖ

కరీమాబాద్, ఫిబ్రవరి 3: తూర్పు నియోజకవర్గ పరిధిలో జరిగే ఉత్సవాలకు అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కరీమాబాద్ బురుజు సెంటర్‌లో నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం రాత్రి జరిగిన ఉర్సు దర్గా ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అందరూ కలసిమెలసి పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కత్తెరశాల వేణుగోపాల్, బత్తిని వసుంధర, పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా పాల్గొన్నారు.

నిట్‌లో 'అగ్రి-హార్టి'పై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జ్యోతిప్రకాశ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3 : వరంగల్ నిట్‌లో విద్యా మంత్రిత్వ శాఖ(ఎంవోఈ), జీవోఐ ఆధ్వర్యంలోని ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) 'అగ్రి-హార్టి'పై వర్క్‌షాప్ నిర్వహించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ వేణువినోద్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్‌వీ ఉమామహేశ్, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి ప్రకాశ్ మహంతి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రకాశ్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ కోలా, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కిట్స్‌లో ముగిసిన 'సంశోధిని-23'

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3: కిట్స్‌లో జాతీయస్థాయి స్టూడెంట్ టెక్నికల్ సింపోజియం సంశోధిని-23 వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సింపోజియం థీమ్ నెక్సస్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇగ్నైటింగ్ మైండ్ అని తెలిపారు. విద్యార్థులు నైపుణ్య దృక్పథం, నాయకత్వ లక్షణాలు, స్టార్ట్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేశ్‌రెడ్డి, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన ఐజీ రమేశ్

మొక్క నాటుతున్న ఐజీ రమేశ్

కరీమాబాద్, ఫిబ్రవరి 3: మామునూరులోని నాలుగో బెటాలియన్‌ను శనివారం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, ఐజీ ఎం రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో జరుగుతున్న పలు నిర్మాణాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం అమ్మవారిపేట వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌ని సందర్శించారు. ఆయన వెంట కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, వరంగల్ క్రైమ్ డీసీపీ మురళీధర్, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ శోభన్, రాజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, దయాశీల ఉన్నారు.

'పన్ను వసూళ్ల నెపంతో వేధింపులు తగదు'

కాజీపేట, ఫిబ్రవరి 3 : గ్రేటర్ 62వ డివిజన్ పరిధి సోమిడిలో మున్సిపల్ అధికారులు ఇంటి పన్నుల వసూళ్ల నెపంతో ప్రజలను వేధించడం సరికాదని దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సోమిడిలో చాలా మంది పేదలు నివసిస్తారని, వారు పనులకు వెళ్లిన తర్వాత మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి నల్లా కనెక్షన్ కట్ చేశారని, షాపులకు తాళాలు వేస్తూ హంగామా చేశారన్నారు. కలెక్టర్, గ్రేటర్ కమిషనర్ స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అద్దె బస్సు డ్రైవర్ల వేతనాల పెంపు

నర్సంపేట, ఫిబ్రవరి 3: నర్సంపేట ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచినట్లు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆర్టీసీ హైర్‌బస్ యాజమాన్య యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అద్దె బస్ డ్రైవర్ల కార్మిక సంఘాలు, హైర్‌బస్ యజమానుల మధ్య శనివారం జరిగిన చర్చలు సఫలీకృతమయ్యాయి. పెరిగిన వేతనం 2025 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్కం ప్రభాకర్, సదానందం, వినయ్‌రెడ్డి, రంగయ్య, దినేష్, కార్మిక సంఘం నాయకులు మురళి, రమేశ్, ప్రశాంత్, రాజు, శ్రీను, శ్రీకాంత్, అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీని ఓడించాలి'

న్యూశాయంపేట, ఫిబ్రవరి 3 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ పార్టీని ఓడించాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు హనుమకొండలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 85 శాతం మంది చెమటోడ్చి ఉత్పత్తిని సృష్టిస్తుంటే, అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ దిగ్గజాల కోసం కేంద్రం దేశ మౌలిక రంగాలను తాకట్టు పెడుతోందని విమర్శించారు. ఫిబ్రవరి 16న సమ్మెలో కోట్లాది మంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు వెంకటేశ్, రాగుల రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కాజీపేట, ఫిబ్రవరి 3 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దక్షిణ భారత దేశ నేవల్ కొచ్చి కమాండర్, పూర్వ విద్యార్థి వెన్నం శ్రీనివాస్ సూచించారు. ఫాతిమానగర్ సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ 68వ వారికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్ రిపోర్టును ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంథోని పోలిశెట్టి చదివి వినిపించారు. పలు అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అన్న చేతిలో తమ్ముడి హతం

ఇన్సూరెన్స్ ఏజెంట్ల హస్తంపై అనుమానం?


కుమారస్వామి(ఫైల్)

నల్లబెల్లి, ఫిబ్రవరి 3 : అన్నచేతిలో తమ్ముడు హత్యకు గురైన ఘటన మండలంలోని నందిగామలో శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కుండె కుమారస్వామి(35), కుండె రవి అన్నదమ్ములు. ఇద్దరు హనుమకొండలో పెయింటింగ్ పనులు చేసేవారు. ఇద్దరు పనులు మానుకొని గ్రామంలోనే ఉంటున్నారు. రవి గొర్రెలను కాసుకుంటుండగా కుమారస్వామి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రవి కత్తితో కుమారస్వామిపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ సీఐ కిషన్, ఎస్సై నైనాల నగేశ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా, ఈ హత్య వెనుక అదే గ్రామానికి చెందిన కొంతమంది ఫేక్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల హస్తం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఇదే గ్రామానికి చెందిన ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు వృద్ధులు, మద్యానికి బానిసైన వ్యక్తులు, అమాయకుల పేరున రూ.లక్షల ఇన్సూరెన్స్ చేసి, వారిని హతమార్చి రూ.కోట్లు గడిస్తున్నట్లు సమాచారం.

కమిషనరేట్ ఎదుట మృతదేహంతో ధర్నా

సుబేదారి, ఫిబ్రవరి 3 : మహిళ మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువులు శనివారం సాయంత్రం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మృతురాలి తల్లిదండ్రులు తస్లీమ్, అఫ్జల్ మాట్లాడుతూ.. తమ కూతురు తస్లీమ్(24)కు శంభునిపేటకు చెందిన ఎండీ తన్వీర్‌తో ఏడాదిన్నర క్రితం పెళ్లి చేశామని, అల్లుడు తమ కూతురిని వరకట్నం కోసం హత్య చేసి అన్నారం చెరువులో పడేశాడని ఆరోపించారు. ఆరునెలల మనవడి ఆచూకీ కూడా తెలువడం లేదన్నారు. తమ కూతురిని హత్య చేసిన అల్లుడు తన్వీర్, అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కూతురు మృతదేహాన్ని సొంత ఊరు కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన సూర్యాపేటతండాలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ధారవత్ లక్ష్మణ్(40) ఆటో నడుపుకుంటున్నాడు. శుక్రవారం కిరాయికి వెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ దొంగల రిమాండ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3: దారి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. వంగపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో దారి దోపిడీ కేసులో నిందితులుగా ఉన్న ముస్కూ కమల్(20), ఏదెల సురేశ్(24), మహ్మద్ అబ్దుల్(29) పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు.

స్మార్ట్ సిటీ- 2.0 చాలెంజ్‌కు వరంగల్ ఎంపిక

- ఈ నెల 8న ఢిల్లీలో సమావేశం
- గ్రేటర్‌కు రూ.135 కోట్లు దక్కే అవకాశం

వరంగల్, ఫిబ్రవరి 3 : స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టు ఇన్నోవేటివ్ అండ్ సస్టెన్ (సీఐటీఐఐఎస్-2.0 చాలెంజ్)కు గ్రేటర్ వరంగల్ ఎంపికైంది. దేశంలోని 84 నగరాలు స్మార్ట్ సిటీ పథకం ద్వారా ఆయా నగరాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన డాక్యుమెంట్స్ సమర్పించాయి. ఈ నెల 8న ఢిల్లీలో జ్యూరీ సభ్యుల సమక్షంలో ఈ నగరాలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయనున్నాయి. వాటిని పరిశీలించి 18 నగరాలను ఎంపిక చేయనున్నారు. గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వరంగల్ తరఫున అక్కడికి వెళ్లనున్నారు. స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్‌లో ఎంపికైతే వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.135 కోట్లు అందనున్నాయి.

నగరానికి గుర్తింపు హర్షణీయం : మేయర్

వరంగల్ నగరం స్మార్ట్ సిటీ- 2.0 చాలెంజ్‌కు ఎంపికవడం హర్షణీయమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇప్పటికే గ్రేటర్ వరంగల్‌కు దేశంలోని ఫాస్ట్ మూవింగ్ సిటీస్‌లో చోటు దక్కిందని, భవిష్యత్తులో నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఇదొక మైలురాయి అని అన్నారు. నిపుణులు, అధికారుల సలహాలు తీసుకుని ఉత్తమ ప్రదర్శన ఇవ్వడానికి శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు.

చలివాగు కింద క్రాప్ హాలిడే ఎందుకిచ్చారు..?

- భగీరథ తాగునీరు ఇవ్వండి..
- శాయంపేట మండల సభలో సభ్యుల నిలదీత


ఎంపీపీ ఇచ్చిన చెక్కును చూపిస్తున్న అమరేందర్‌రెడ్డి

శాయంపేట, ఫిబ్రవరి 3 : ఎంపీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన మండల సభ శనివారం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు ఆలస్యంగా సభకు వచ్చారు. సర్పంచ్‌లు లేకపోవడంతో కొందరు ఎంపీటీసీలు, కార్యదర్శులు సమస్యలను లేవనెత్తారు. చలివాగు కింద యాసంగి సాగుకు మరమ్మతు పనుల కోసం క్రాప్ హాలీడే ఇచ్చారని, కానీ, కాంట్రాక్టర్ రూ.10.30కోట్ల పనులను మొదలు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని కొప్పుల ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ ఆరోపించారు. జూన్ వరకు మళ్లీ సాగు మొదలవుతుందని, ఎలా పనులు జరుగుతాయని ఐబీ ఏఈఈ అమృత్‌ను ప్రశ్నించారు. మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రావడం లేదని పలు గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అయితే, తాగునీటి సమస్యలపై ప్రత్యేక సమావేశం పెట్టి పరిష్కరిస్తామని ఇన్‌చార్జీ ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి నచ్చజెప్పారు. అలాగే, పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ శరత్, పీఆర్ డీఈ లింగారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీపీ డబ్బులివ్వాలంటూ మండల సభలో లొల్లి

మండల సభ జరుగుతుండగా ప్రగతిసింగారానికి చెందిన మెతుకు అమరేందర్‌రెడ్డి, అర్చన దంపతులు వచ్చి ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తమకు రూ.5.30లక్షలు ఇవ్వాలని, కాంట్రాక్టు పనులు చేసి ఎనిమిదేళ్లు అయినా పట్టించుకోవడం లేదని నిలదీశారు. డిసెంబర్ 5న రూ.5.30లక్షలకు చెక్కు ఇచ్చాడని, బ్యాంకుకు వెళ్తే డబ్బులు లేవన్నారన్నారు. డబ్బులు అడిగితే ఎంపీపీ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. వెంటనే తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో సభ కొద్దిసేపు నిలిచిపోయింది. శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మధ్య వాగ్వాదం జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీవో జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో బయటకు వెళ్లారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్‌గా మధుసూదన్



కరీమాబాద్, ఫిబ్రవరి 3: వాకర్స్ ఇంటర్నేషనల్-303, 19 జిల్లాల జోనల్ చైర్మన్‌గా కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మేడిది మధుసూదన్ శనివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు జాతీయ సైన్స్ డే పోటీలు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 3: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో డీ వాసంతి తెలిపారు. వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం, ప్లాస్టిక్‌కు నో చెప్పడం, నీటిని ఆదా చేయడం, శక్తిని ఆదా చేయడం వంటి వాటిపై ఈ నెల 9న హంటర్‌రోడ్డులోని సైన్స్ కేంద్రంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నామని, వివరాలకు 9848878455 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకు మోపెడ్‌లు పంపిణీ చేయాలి

నర్సంపేటరూరల్, ఫిబ్రవరి 3: గీత కార్మికులకు ప్రమాదాల నివారణ కోసం సేఫ్టీ మోకు మోపెడ్‌లు పంపిణీ చేయాలని మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. నర్సంపేట సర్వాపురంలో శనివారం మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు అమలు కోసం వెంటనే జీవో జారీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, కొండి రాము, గొడిశాల సదానందంగౌడ్, గంప రాజేశ్వర్, మద్దెల సాంబయ్య, శీలం వీరన్న, దొంతి సంతోష్‌గౌడ్, మల్లేశ్, జూలూరి హరిప్రసాద్ గౌడ్, సురేశ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

'చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలి'

నెక్కొండ, ఫిబ్రవరి 3: కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఈ నెల 8న మాస, ఐఎఫ్‌టీయూ చేపట్టిన చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ సర్కారు అంబాని, అదాని వంటి బడా కార్పొరేట్ వ్యాపారులకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందాటి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు బాలరాజు, నాగెల్లి శ్రీనివాస్, బండి వెంకట్, తోట రాజేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★WGL-HYD Highway కి Prime Locations లలో DTCP Approved Plots కలవు. Site Visit కొరకు సంప్రదించండి. Call: 7095422395
NTW-000

HOUSE FOR SALE
★Prime Location, Near Water Tank, Nakkalagutta, Hanamkonda 427 Sq.yds. House for Sale, Cont: 9951635544, 8106263785.
NTW-000

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

CHANGE OF NAME
I, MERUGU SUJATHA (New Name), prevously called KANUKUNTLA SHOBHARANI (Old Name), and Residing at H.No. 23-3-14, New Shayampet, Hanumakonda Dist-506001. TS, India, and solemnly Declare.

CHANGE OF NAME
★I, MOHAMMED KHAJA PASHA S/o MOHAMMED MAQBOOL AHMED of my minor Daughter name as SHAHESTHA ZABEEN have changed my daughter name to SHAISTA JABEEN R/o H.No. 14-6-91, Nizampura, Warangal T.S-506002.
NTW-000

★I, CHEETY SAI KRISHNA, R/o. 1-1-693, Bheemuni Dubba, Korurla Mandal, Jagityal-505 326, T.S. Changed My Name as CHEETI SAIKRISHNA, S/o. Cheeti Praveen Kumar.
NT-319693

★I, KUNDURU SWARUPA RANI, R/o. 2-11-62/4/1, Hanmanth Rao Nagar, Gopalpur, Vidyaranyapuri, Hanamkonda-506 009. Changed My Name as SARVA SWARUPA RANI, W/o. Kunduru Vijaya Bhasker Reddy.
NT-319692

లోన్స్

★SBI లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త.. ఎటువంటి సమస్యలున్న Solve చేసి అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్: 9493910808.
NTW-00

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565